## ఇది జీవితం!



అతని పేరు ముసిలాడు. ముఖం మీద అనుభవాల ముడతలు. అతను ఎక్కడ పుట్టాడో తెలియదు. ఆ గ్రామంలో అందరూ ముసిలాడు అంటారు. ముసిలాడు చెరువు గట్టు మీద కూర్చుని నిశ్చలంగా వున్న నీటిలోకి చూస్తున్నాడు. చిన్న చేపపిల్ల తమాషాగా ఆడుతుంటే చూస్తున్నాడు. చేప పిల్ల! అప్పుడు గుర్తుకొచ్చింది. స్వాతంత్ర్యానికి పూర్వం తను ప్రేమించిన పిల్ల చేప కళ్ళది తన చేతకానితనంవల్ల ఇంకొకడిని పెళ్ళిచేసుకుని 'సతి'కి బలయిపోయింది. తను ఏం చేశాడు-శ్మశానంలో మౌనంగా రోదించడం తప్ప! తెలిసున్నవాళ్ళు ముసలాడికి అప్పుడు పెట్టిన పేరు "చేతకానివాడు". స్వాతంత్ర్యం వచ్చాక తెలివైనవాళ్ళు బాగుపడి ఆస్తులు సంపాదించుకున్నా, ముసిలాడు వున్నది పోగొట్టుకుని మారిపోయాడు కూలిగా. ముసిలాడు గతంలోంచి బయటికి వచ్చాడు. చేప పిల్ల చెరువులో ఆడుతుంటోంది. ఎవడో కొంటె కుర్రోడు నీటిలోకి రాయి వేశాడు. నీటిలో చలనం! ముసిలాడికి గత మంతా చేదుగా తోచింది. తన జీవితం ఏమయింది? వైఫల్యం నీడలా వెంటాడింది. సుఖం ఎలాగ వుంటుందో తెలియని బ్రతుకు.

రాత్రి తాతారావు సైకిల్ షాపులో ముసిలాడు సైకిల్ తుడుస్తూ క్రొత్తగా చేరిన కుర్రాడితో అన్నాడు- "నా బ్రతుకు తగలడింది"

"ఏమిటి నాలుగు రోజుల నుండి ఈమాటేఅంటున్నావు?"

"అవున్రా! నా బ్రతుకు బండలయింది"

"నీ బ్రతుకు వ్యర్థమని ఎందుకనుకోవాలి? నీవు చేసిన పొరపాట్లు మాకు పాఠాలు. నీ త్యాగాలు మాకు ఆచరించదగినవి. నీ బ్రతుకు మా బ్రతుకు దిద్దుకోవడానికి ఉపయోగపడుతున్నప్పుడు నీ బ్రతుకు బండలయింది అని అనుకోడం ఎందుకు?......"

క్రొత్తకుర్రాడు చెబుతున్నాడు. వాడు చదువుకున్నవాడు. అతని మాటలు పనిచేస్తున్నాయి ముసిలాడి మీద! ఏదో జీవన సత్యం తెలిసింది!

ముసిలాడి వెండి వెంట్రుకల గుబురు గడ్డం లోంచి చిరునవ్వు మెరిసింది.

—ఎం.వి

## కంగారు ... కనకంగారు

"తాతయ్యా! మనింట్లో కుళాయి పాడయ్యి, నీళ్ళు ధారగా పడిపోతున్నాయనుకో! అది ఆపడానికి ఏం చెయ్యాలో చెప్పు చూద్దాం."



"వాటర్ బిల్లు కట్టడం మానేయాలి బాబూ!"

"భలే భలే! మరోటి. డబ్బున్నా, లేక పోయినా పైకి ఒకేలా కనపడేదెవరు?"

"క్యాష్ బాక్స్ రా తండ్రీ!"

"ఓహో! ఎంత జ్ఞానోదయంకలిగించావు తాతా! చివరిగా చిన్నది, నాలుగు కాళ్ళున్నా నడవలేని జంతువేది?"

" 'చచ్చిన దున్నపోతు' రా నాయనా."

మెజీషియన్ బి.వి.పట్టాభిరామ్

## మ్యూజికల్ జీనియస్ — "సత్యం"



### ఈ మధ్య మరణించిన సంగీత దర్శకుడు "సత్యం" స్మృతి చిహ్నంగా

ఉత్తరాది సంగీత దర్శకుల ద్వయం 'శంకర్- జైకిషన్'లను అభిమానించి వారి ప్రత్యేక మైన 'రిథం'ను తన సంగీతంలో ప్రవేశ పెట్టి, అది 'సత్యం మార్క్ సంగీతం' అని తనకంటూ ఒక ప్రత్యేకతను నిలుపుకుని సినీ సంగీత ప్రపంచంలో సంగీతామృతం కురి పించిన సంగీత దర్శకుడు — "సత్యం".

సత్యంగా పేరుపొందిన శ్రీ చెళ్ళపిళ్ళ సత్యం 1933 లో పార్వతీపురం సమీపంలో జన్మించి, కాకినాడలో పెరిగారు. అక్కడ 'యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్' లో మెంబరై అందులో ప్రముఖ పాత్ర వహించారు. అందులో 'డోలక్' వాయిస్తూ అందర్నీ ఆనందపరచేవారు. తన 14 సం.ల వయస్సులో అక్కడే అంజలీదేవి, ఆదినారాయణ రావుగార్లతో పరిచయం కలిగాక మద్రాస్ చేరుకుని ఆదినారాయణరావు గారి దగ్గర కొంత కాలం పనిచేశాక ప్రముఖ సంగీత దర్శకుడు శ్రీ టి.వి. రాజుగారి వద్ద మరి కొంత కాలం పనిచేశారు. ఈ కాలంలో ఆయన 'డోలక్ సత్యం'గా పేరు పొందారు.

శ్రీ భావనారాయణగారు నిర్మించిన గౌరీ ప్రొడక్షన్స్ "పాల మనసులు" చిత్రం ద్వారా తెలుగులో సంగీత దర్శకత్వం వహించడం ప్రారంభించిన 'సత్యం' అంతకు మూడు సంవత్సరాల ముందే 'రామాంజనేయ యుద్ధం' చిత్రం ద్వారా కన్నడ చిత్ర రంగంలో ప్రవేశించి, ఈ మూడు సంవత్సరాల కాలంలో అనేక కన్నడ చిత్రాలకు సంగీతం సమకూర్చారు. కన్నెవయసు, మట్టిలో మాణిక్యం, స్వర్గం-నరకం, సర్కార్ ఎక్స్‌ప్రెస్, దేవుడమ్మ, బుల్లెమ్మ-బుల్లోడు, కృష్ణార్జునులు, పుట్టినిల్లు-మెట్టినిల్లు, పగబట్టిన సింహం, కోరుకున్న మొగుడు, రహస్య గూఢచారి, నోము, నిప్పులాంటి మనిషి, భక్త కన్నప్ప, తోట రాముడు, ప్రేమలేఖలు, రామయ్య తండ్రి, స్వప్న, అమర దీపం, కార్తీక దీపం, స్వయంవరం, సీతారాములు, గృహప్రవేశం, కాంచన సీత, తలంబ్రాలు, ఆహుతి వంటి అనేక తెలుగు చిత్రాలతో పాటు 500 పైగా కన్నడం, తమిళం, మళయాళం, హిందీ చిత్రాలకు సంగీతం సమకూర్చి, అనేక పాటలకు ట్యూన్‌లు కట్టి- తనదైన ప్రత్యేక బాణీలో 'సత్యం మార్క్ ట్యూన్స్'తో శ్రోతలను ఆకట్టుకున్నారు. అనేక మందిచేత ప్రశంసలు అందుకున్నారు.

శివశివ శంకరా, కండ గెలిచింది (భక్త కన్నప్ప); అంకితం నీకే అంకితం (స్వప్న), ఆరనీకుమా ఈ దీపం (కార్తీకదీపం), ముసురేసిన మబ్బులలో, గాలివానలో (స్వయంవరం); స్నేహమేరా జీవితం (నిప్పులాంటి మనిషి), ఇది పాట కానే కాదు, ఓ దానవుడైన (తలంబ్రాలు); అందరి దైవం, నాగుల చవితి (నోము); ఏమండోయ్ శ్రీమతిగారు (సీతారాములు), చిలకమ్మ పలికింది (కార్తీక దీపం), కలిసే కళ్ళలోన (నోము), మల్లి విరిసింది (రామయ్య తండ్రి), మా వారు బంగారు కొండ (ప్రేమమూర్తులు), ఓ బంగరు వన్నెల చిలకా (తోటరాముడు), విన్నానులే పొంచి విన్నానులే (ప్రేమ లేఖలు), కొమ్మకో పండంట (ఘరానా గంగులు) వంటి అనేక పాటలు మనకు ఎప్పటికీ గుర్తుండే పాటలు. ఎన్నటికీ మరచి పోలేని 'ట్యూన్స్', శరణం నీ దివ్య శరణం (మట్టిలో మాణిక్యం) వంటి పాటల ద్వారా సంగీత, సంప్రదాయ గీతాలకు సంగీతం సమకూర్చి ఎందులోనూ తీసిపోరని అనిపించుకున్నారు. "సువర్ణ సుందరి" చిత్రంలో తనే స్వయంగా 'నే తాళ లేను ఓ బాల' అనే పాటను గానం చేసినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా డాక్టర్ దాసరి దర్శకత్వం వహించిన 'పాలు-నీళ్ళు' చిత్రం ద్వారా ప్రముఖ గాయని 'ఆశాభోంస్లే' గారిచే తెలు